

దంటు వసుంధర

"నిన్న పనిలోకి రాలేదేం?" వాకిట్లోనే పనిమనిషిని నిలేసింది జయమ్మ. అదేమిటో ఆ పనిమనిషి ఆవిడ కోపాన్ని అర్థం చేసుకున్నట్లే కనబడదు. ఎపుడూ, వయ్యారంగా లోపలికి నడచుకొంటూ పోయి, తలుపుచాటునున్న చీపురు చేతిలోకి అందుకుంటూ, "నిన్నమ్మా.... మరేమో...." అంటూ ప్రారంభించింది. ఏ విషయాన్నైనా, అదెంత చిన్నదయినాసరే, వర్ణిస్తూ, కళతో, చేతులతో అభినయిస్తూ, ఆశ్చర్యంగా కళ్ళింతింత చేసుకుని చెప్పటం దాని అలవాటు. అది అలా ప్రారంభిస్తే ఇక త్వరగా ముగించదని తెలుసు జయమ్మకు.

"సర్లే, త్వరత్వరగా కసవూడ్చి నీళ్ళు జల్లు. గలవాకిట ముగ్గు లేక ఎలా ఉందో చూడు! నిక్కినీలిగి ఇపుడా రావటం? నిన్న పనిలోకి రానిదానివి ఈ రోజు కొంచెం పెందరాడే రావద్దూ?" అని మందలించి, లోనికి, భర్తకు కాఫీ కలిపివ్వటానికి వెళ్ళింది.

రోజూ వచ్చే టైమే అయినా ఆవేళ 'నిక్కి నీలిగి' ఎందుకు అయిందో, నిన్న పనిలోనికి రాకపోతేమాత్రం ఈరోజు అలవాటుకన్న ముందుగా ఎందుకు రావాలో అర్థం కాకపోయినా, ఎదురు ప్రశ్నించలేదు పనిమనిషి. అమ్మగారు కోపంగా ఉన్నారని గ్రహించి, మౌనంగా, చకచకా పనులు చేసుకోసాగింది.

* * *

అసలా పనిమనిషిని చూస్తేనే జయమ్మకు గిట్టదు. ఆవిడ చిరాకు, కోపానికి కారణాలు :

ఒకటి : దాని పేరు. రెండు : రూపం. మూడు : కట్టు బొట్టు, వేషభాషలు. నాల్గు : దాని పుత్రరత్నం... ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో...

పదిహేనేళ్ళపాటు విశ్వాసంగా పనిచేసిన లింగమ్మ, మూణ్నెల్లపాటు స్వగ్రామానికి పోతూ, తన స్థానంలో పనిచేసేందుకు తీసుకొచ్చినపుడు, చూడగానే ఎందుకో జయమ్మకు కొత్తమనిషి వాలకం నచ్చలేదు.

చామనఛాయతో, బొద్దుగా, పెటపెటలాడుతున్న వంటిమీద గులాబీరంగు బిగుతైన వాయిల్ రవికె, సన్నని పూలున్న అదే రంగు వాయిల్‌చీర ధరించి, జుట్టు అందంగా దువ్వి జడ వేసుకుని, ఆ జడను బుజాలమీదుగా గుండెల మీద పడేట్లు ముందుకేసుకుని, వయ్యారంగా గుమ్మాని కానుకుని నిలబడ్డ ఇరవైయేళ్ల పడుచుదాన్ని చూస్తూనే నొసలు చిట్లించింది.

"నీ పేరు?" అంది అప్రసన్నంగా చూస్తూ.

"లీల..." ముసిముసిగా నవ్వుతూ సమాధానమిచ్చింది.

కాస్తో కూస్తో వున్న సదభిప్రాయం కూడా ఇగిరిపోయింది జయమ్మలో. తీరులోనే కాక పేరులో కూడా ఆవిడ అహాన్ని దెబ్బతీసింది కొత్త పనిమనిషి. వెలిసినట్లున్న ముదురురంగు చీరలో, దానిపై పొంతనలేని వదులు రవికెతో, తైలసంస్కారం ఆట్టేలేని జుట్టు వేలుముడి వేసుకుని, కొంచెం జిడ్డోడుతున్న ముఖంతో వున్నట్లయితే ఆవిడకీ మనిషి నచ్చివుండేది. అలాగే దాని పేరు కూడా, 'అచ్చి', 'బుచ్చి' 'లచ్చి' — ఈ ధోరణిలో వుంటే ఆమె మనసుకు నెమ్మదిగా వుండివుండేది.

'మాచింగ్ జాకెట్ ... నున్నగా దువ్విన తల ... ఇదేం పనిమనిషి?' అనుకుంది. డబ్బుకు ఇబ్బందిపడుతున్నారనీ, పనిలో పెట్టుకుని దానికో ఆధారం కల్పించమనీ లింగమ్మ బతిమాలితే 'పాపం!' అనుకుంది జయమ్మ. లీలను చూస్తుంటే పని చేయవలసిన అవసరం వున్నట్లు కన్పించలేదు. ఆ మాటే ఒంటరిగా వున్నపుడు లింగమ్మతో అంది. "అయినా అంత తీరుగా వున్న మనిషి, మనసుపెట్టి పనేం చేస్తుంది?" అని సందేహం కూడా వెలిబుచ్చింది.

"మీరలా తలచకుంరి. పని బాగా చేస్తుంది. దాని ఆదిమ్మగన్క ఫాక్టరీల నౌకరీ ఛోడ్కెరాకుంటే దానికింకా రంగురంగుల కోకలూ, రైకలూ గొనిచ్చు. ఆడ ముక్కా నొచ్చి ఫాక్టరీ మూసింరడు. ఈడ్కి ఏరే నౌక్రీ దొర్కెవర్కు కష్టమైతది. తవరె గాపాడాల ... పని బాగా చేస్తది. తవరె శూడుండ్రి..."

లింగమ్మ బాగా నచ్చజెప్పిన తర్వాత ఒప్పుకుంది అయిష్టంగానే. 'మూడు నెలలకేగా' అని సరిబుచ్చుకుంది.

"మీవాళ్ళను చూసిన సంబడంతో అక్కడే దిగబడిపోయేవుసుమీ! సరిగా మూడు నెలలు కాగానే వచ్చేయాలి" అని హెచ్చరించి మరీ పంపింది.

"ఏం పనిమనిషో ... నాకంటే నీటుగా వుంది. చూశారా?" అంది భర్త రామనాధంతో. మనసులో ఏమనుకున్నా భర్తతో పంచుకోవడం అలవాటామెకు. పిల్లలు లేకపోవటం, ఇరుగు పొరుగు స్నేహాలు కూడా పెద్దగా లేకపోవటంతో ప్రతి విషయాన్నీ భర్తకు చెప్పటం అలవాటయింది. అతనికీ, ఆమె ఒంటరితనం తెలుసుగనుక శ్రద్ధగా వింటూంటాడు.

"పని బాగా చేస్తేసరి. మిగతా విషయాలు పట్టించుకోకు" అని సలహా యిచ్చాడు. మర్నాటి నుండీ లీల పనిలోకి రాసాగింది.

* * *

మనిషిని చూడగానే అయిష్టత ఏర్పరచుకున్నందువల్ల, దాని పని బాగుండదనీ, ఏదో వంక కనబడుతుందనీ దృఢనిశ్చయంతో వుంది జయమ్మ. కాని ఆమె ఆశించినట్లు లీల పనిలో వంకలేమీ కనబడలేదు. కట్టు బొట్టుకి మల్లేనే పనిలో కూడా లీల పోకడ తీర్చిదిద్దినట్లుగా వుంది. మాట తీరు కూడా పనిపాటలవాళ్ళకిమల్లే యాసతో

గాక స్పష్టంగా మాట్లాడుతుంది. ఇవన్నీ చేరి జయమ్మ చిరాకుని మరింత ఎక్కువచేసి ఆమెలో— అకారణ కోపాన్ని రగిలించాయి. ఏదో కారణంగా తప్పులు పట్టాలని ప్రయత్నించేది.

శుభ్రంగా తోమిన అంట్లను గుడ్డతో తుడిచి వంటింటి బయట గట్టుమీద బోర్లించింది లీల మొదటిరోజు.

"ఓసి నీదుంపతెగ! ఇదేం పని? నువు తోమిన అంట్లు అలాగే తెచ్చి బోర్లిస్తావా?" అని గద్దించింది జయమ్మ.

"నీటి చుక్కలు ఎండి మరకలవుతాయని తుడిచానమ్మా. తుడిస్తే గిన్నెలు తళతళలాడతాయని..." అంది లీల భయపడుతూ. అంతటితో ఆగక, "మా ఇంట్లో కూడా అలాగే తుడిచి బోర్లిస్తాం" అని జోడించటంతో జయమ్మ కోపం ఆకాశాన్నంటింది.

"ఏమిటీ? నీ కొంపను ఈ యింటితో పోలుస్తావా? ఇది ఆచారం, పాడూ లేని ఇల్లనుకున్నావా? తళతళ చాలుగాని, తోమిన అంట్లు బావి గట్టు మీదనే వుంచు. నేను నీళ్ళుజల్లి తొలచి లోపల పెట్టుకుంటాను. ఇంకెపుడూ గిన్నెలు ఇంత దూరం తీసుకరామోకు" అని ఆజ్ఞ జారీచేసి లోనికి వెళ్ళింది.

మరోనాడు. .

జామచెట్టుకి ముడేసి ఆరేసిన చీర, వెంకటగిరి జరీది, ఆరిపోయినాగాని, ఏదో ధ్యాసలో వుండి లోన పెట్టుకోవటం మర్చిపోయింది జయమ్మ. ఎండ విపరీతంగా కాస్తోంది.

ఆకుపచ్చని అంచున్న ఎర్రని చీర మిరపపండులాగా మెరిసిపోతోంది ఆ ఎండలో.

'ఇంకాసేపు ఇలాగే ఎండలో వుంటే చీర పెట్టినట్లయి రంగు వెలిసిపోతుందేమో!... చక్కనిచీర!' అనుకుని తానే ముడివిప్పదీసి, పొందిగ్గా మడత వేసి లోనికి తెచ్చింది లీల. సంతోషం, మెప్పు కనబరచకపోగా, కనుగుడ్లు పెద్దవిచేసి భృకుటి ముడిచిన అమ్మగార్ని చూసి తానేం తప్పు చేసిందో అర్థంకాక కంగారుపడింది.

"మడిలో ఎండవేసిన చీరను తాకావా?" 'ఎన్ని గుండెలే నీకు?' అన్నట్లు హుంకరించింది జయమ్మ.

"ఎండ ఎక్కువగా ఉంది... చీర..." తడబాటుపడింది లీల.

"ముందా చీరని నీళ్లబకెట్లో పడెయ్యి. అధిక ప్రసంగితనం... నువ్వూను... నన్ను పిలవరాదూ చీర ఎండితే?"

'చాకలి ఉతికి తెచ్చిన అయ్యగారి బట్టలు అలానే లోపల పెట్టుకుంటారుగదా! నేను చీర తాకితే తప్పేమిటి?' అని ఆలోచించింది లీల. దానికేమీ బోధపడలేదు.

మరోసారి... ఒక పండుగ రోజున...

వంటపనిలో మునిగి ఉంది జయమ్మ. ఉన్నది ఇద్దరే అయినా ప్రతి పండక్కూ పంచభక్ష్యాలూ, పరమాన్నమూ చేస్తుంటుంది. పూర్ణాలు గోధుమ పిండిలో ముంచి నూనెలో వేస్తూ "టైమెంతయిందో... ఇవింకా పూర్తికాలేదు..." అనుకుంది స్వగతంలాగా, నుదుటిమీద చెమటను కొంగుతో అద్దుకుంటూ. ఆమె స్వగతంలా అనుకున్నా, ఆ మాటలు వంటింటి కిటికీపక్కనే మందారపూలు కోస్తున్న లీల చెవినబడ్డాయి. పూలబుట్ట క్రింద పెట్టి, హాల్లోకి వెళ్లి టైం చూసి వచ్చి, వంటింటి గోడవద్ద నిలబడి అమ్మగారికి వినబడేట్లుగా, "తొమ్మిదిన్నర అయిందమ్మా. పూజకు పూలు కోయటం కూడా అయింది. ఇమ్మంటారా?" అంది.

"జాజి పందిరి గట్టుమీద పెట్టు, నీళ్ళు జల్లి తీసుకుంటాను. అవునూ... టైమెలా తెలిసిందే నీకు?" క్రాస్ ఎక్జామినేషన్‌తో అడిగినట్లు అడిగింది. లీల ముఖం విప్పారింది. తన విజ్ఞానాన్ని, విద్యార్హతలను అమ్మగారికి చెప్పే అవకాశం కలిగినందుకు సంతోషిస్తూ,

"హాల్లో గడియారం చూశానమ్మా. నాకు టైం చూట్టం వచ్చు. అయిదో క్లాసువరకు చదువుకున్నానుగదా! పేపరుగూడా చదవగల్ను. ఇంకా చదువుకుందునుగాని, పెళ్లి చేసేసింది మా అమ్మ..." అని ఉత్సాహంగా ఏవేవో చెప్పేస్తోంది.

బూర్లెమూకుడులోని పూర్ణంలాగే నల్లగా మాడిపోయింది జయమ్మ ముఖం. ఆవిడ చదువుకున్నదీ, అయిదోక్లాసువరకే.

"సర్లే... వసపోసిన పిట్టలా వాగక చెట్లకి నీళ్ళు తోడిపొయ్యి ఎండెక్కకమునుపే..." అని కసిరింది.

పనిమనిషి, తానూ సమానంగా చదివి వుండటం సుతరామూ నచ్చలేదు ఆవిడకు. ఇంత పెద్ద వయసులో పై చదువులు కొనసాగించి, దానిపైన ఆధిక్యత సంపాదించటం అంత తేలిక కాదు. కనుక మరొకవిధంగా తన ఆధిక్యతను నిరూపించుకుని సంతృప్తిపడదలచింది. అందుకే— ఇల్లు శుభ్రంగా చిమ్మినాకూడా 'ఇంకా కసవు సరిగా పోలేదు. మళ్ళీ చిమ్మ'మని పురమాయించటం,

లేదని ప్రమాణం చేసినా వినక, 'నీళ్ల బిందెని ముట్టు'కున్నావని బుకాయించి నీళ్ల పారబోయించటం,

నడచివస్తున్న దాన్ని మధ్యలోనే, 'ఏమిటలా గుడ్లు నెత్తిమీద పెట్టుకుని నడవటం? మీద మీదికి రాకుండా కాస్త ఆసింటా నడవలేవూ?' అని నిలేయటం — లాంటి వెన్నో ...

ఆవిడ ఇంత అఘాయిత్యం చేసినా లీలకు చీమ కుట్టినట్లయినా వున్నట్లు కనబడలేదు 'ఆనందం నా సొత్తు'న్నట్లు బొంగరంలా తిరుగుతూ పనులన్నీ చుట్టబెట్టేది. చెట్లకు నీళ్ళు పోస్తున్నపుడో, పూలు కోస్తున్నపుడో కూనిరాగాలు కూడా తీస్తుండేది.

'ఇంత తిట్టినా దానికి కొంచెమన్నా సిగ్గులేదేం?' అని విసుక్కుబోయేది ఆవిడ. అమాటే ఒకమారు భర్తతో అంటే, "తిట్టింది నువ్వూ, సిగ్గుపడవలసింది వేరొకర్తూనా?" అని ఎదురు ప్రశ్నించాడు. "నీ తిట్లన్నీ దీవెనలనుకొంటూందేమో" అని చమత్కరించాడు.

*   *   *

ఒకరోజు ఏడాది వయసున్న పిల్లవాణ్ణి వెంటతెచ్చింది లీల.

"వీడెవడే? తోకపీకుడులాగా?"

"నా కొడుకమ్మా .. మా అత్త ఊరికి పోయింది వీణ్ణి ఇంటికాడ చూసుకుందుకు ఎవరూ లేరు...' బెరుగ్గానే వాణ్ణి ఓ మూల కూచోబెట్టింది. "గోడవేమీ చెయ్యడమ్మా ... పని చేసుకుంటూ నే గమనించుకుంటాను." బతిమాలుతున్నట్లుగా అంది. ఎప్పుడూ మడి - ఆచారం అనే అమ్మగారు వాణ్ణి ఇంట్లోకి తేవద్దంటుందేమోనని దాని భయం. ఏదో ఒక కారణంతో పనికి ఎగనామం పెట్టకుండా వచ్చినందుకు దాని నిజాయితీకి సంతోషించి, "సర్లేకానీ ... వాడు అవీ ఇవీ తాకితే మాత్రం నాకు మాచెడ్డ కోపం వస్తుంది" అని వార్నింగ్‌తో బాటు పర్మిషన్ కూడా ఇచ్చింది జయమ్మ.

లీల లోపలి పనిలో వున్నపుడు ఓరగా పిల్లవానివైపు చూసి ఆశ్చర్యపోయింది వాడింత ముద్దుగా వుంటాడని ఊహించలేకపోయింది కొంచెం రంగు తక్కువే అయినా బొద్దుగా వున్నాడు. కుంకుడుగింజల్లాంటి నల్లని కళ్ళు అటూ ఇటూ తిప్పి ఆశ్చర్యంగా చూస్తున్నాడు. లక్కపిట్టలాంటి నోరు తెరుస్తూ మూస్తూ ఆఁ వూఁ అంటున్నాడు. బుల్లి బుల్లి కాళ్ళూ చేతులూ గాల్లోకి విసిరి ఆడుకొంటున్నాడు. 'ఏం పెట్టి ఈ భడవనింత బొద్దుగా తయారు చేసిందో?' అనుకొంది కొంచెం అసూయ కలసిన ఆశ్చర్యంతో

*   *   *

పిల్లలు లేకపోయినా అదొక లోపంగా భావించినట్లు ఎపుడూ కనబడ్లేదు జయమ్మగాని రామనాథంగాని.

బంధువులు కాకుల్లాంటివారు. ఊరికే ఉండరు. పుండును పొడిచి ఆనందించినట్లు లోపాలెత్తి చూపిస్తూ వ్యంగ్యంతో కూడుకున్న సానుభూతి వ్యక్తం చేస్తారు. పైకి సానుభూతిగా కనిపించినా లోపల ఎగతాళి, ఎత్తిపొడుపు ఉంటుంది అదొక ఆనందం కొందరికి.

"ఏమ్మా, జయమ్మా, ఎన్నాళ్ళు ఒంటరి బతుకులు ఈడుస్తారు? ముందు రోజుల గురించి ఏమన్నా ఆలోచిస్తున్నారా?" అని కొందరు పరామర్శిస్తే,

"ఏమిటో తల్లీ, నీ కడుపున ఒక కాయి కాచి, ఈసరికి ఒక పాతికేళ్ల కొడుకో, కూతురో ఉండివుంటే ఎంత బావుండేది!" అని విచారం వెలిబుచ్చేవారు మరికొందరు.

తమ పిల్లల ముద్దుముచ్చట్లు చెప్పి, జీవితంలో మీరెంతో కోల్పోతున్నారని తెలియజెప్పాలని ప్రయత్నించేవారు కొందరయితే, తమ పిల్లల్ని పెంచుకోగూడదా అని ఆశించేవారు మరికొందరు. కాస్తో కూస్తో ఆస్తి ఉండి, పిల్లలు లేనివారికి బంధువుల పీకులాట కొంచెం ఎక్కువగానే ఉంటుంది. తమ పిల్లల్లో ఒకరిని దత్తత తీసుకొమ్మని కొందరు సూచనలు చేశారు, వేయించారు — జయమ్మ వైపువారూ, రామనాథం

వైపువారుకూడా. అలాంటి బంధువుల దృష్టి తమ శ్రేయస్సుమీదగాక తమ ఆస్తిమీద ఉందని గ్రహించలేకపోలేదు ఆ దంపతులు.

సాధారణంగా పిల్లల విషయంలో, పెంపుడు విషయంలో మెత్తబడేది ఆడదే. మగవాడికి ఒక ఉద్యోగమూ, వ్యాపకమూ ఉన్నందువల్లనేమో ఈ విషయం గురించి అంతగా పట్టించుకోడు. ఇక్కడ, ఆడదైన జయమ్మకే పిల్లలపట్ల బలహీనత లేనందున, దత్తత గురించి వారిరువురూకూడా ఆలోచించలేదు. అలాంటి సూచనలిచ్చిన బంధువులను దూరంగానే నిలిపి ఉంచారు. తనదాకా వచ్చిన సానుభూతిపూర్వక పరామర్శలను తగువిధంగా తిప్పికొట్టేది మాటకారి అయిన జయమ్మ.

"పూర్వజన్మ ఋణానుబంధం పిల్లలు. మాకు ఋణం లేదేమో, తెరిపిగా ఉన్నాం" అని అందరి నోళ్లూ మూయించేది. 'గొడ్రాలు కేం తెలుసు బిడ్డ తీపి' అని ఒక క్రూరమైన నిందవేసి ఊరుకున్నారు బంధువులు.

*  *  *

లీల కొడుకు పేరు 'రాజా' అని తెలుసుకున్నపుడు ఎక్కువ ఆశ్చర్యపోలేదు జయమ్మ. వాడి పేరు 'భాస్కర్' అనో 'ప్రభాకర్' అనో ఉన్నా ఆశ్చర్యపోయి ఉండేదికాదు. ఆసరికి ఆమెకు లీల మంచి 'టేస్టు'న్న మనిషని అర్థమయిపోయింది.

పని చేసుకుంటూ మధ్య మధ్య పిల్లవాడున్న గదిలోకి తొంగిచూసి పోతుండేది లీల. అపుడపుడు వాణ్ని ఒడిలోకి తీసుకుని "నా బంగారురాజా" అని ముద్దులాడేది.

"గొప్పింటి బిడ్డలాగుంటాడని మావాళ్లంతా ఈసుపడి వస్తారమ్మా! ... నాకు భయం దిష్టి తగుల్తుందేమోనని ... ఎవరింటికీ తీసికెళ్లనందుకే" అని చెప్పేది మురిపెంగా అందులో కల్లాకపటంలేని ఆనందమే తప్ప మరో భావం లేకపోయినా ముఖం తిప్పేసుకునేది జయమ్మ.

"వీణ్ని బాగా చదివించాలనుకొంటుండామమ్మా. మన 'అయ్యగారి' లాగా ఉద్యోగం చెయ్యాలిగాని వాడి అయ్యలాగా ఫేక్టరీ పనికి పోగూడదు." అలాగ తన కలలను, ఆశలను ఏకరువు పెట్టేది.

"డాక్టరీ చదివిస్తావా? ఇంజనీరు చేస్తావా?" అని వెటకారంగా అడిగితే, ఆ వెటకారాన్ని గ్రహించకుండానే, "అంత పెద్ద చదువులు మాకెక్కడ అబ్బుతాయమ్మా? ... బియ్యే చదివించాలనుకొంటుండాం" అని నిజాయితీగా సమాధానమిచ్చేది.

"నీ పిచ్చిగాని, ఏదైనా నెత్తురులో వుండాలే ... ఇంట్లో చదివినవాళ్ళు వుంటేగాని పిల్లలకు చదువబ్బదు. వీడూ అయ్యలాగే ఫాక్టరీలో కెళతానని కూచుంటే నువ్వేం చెయ్యగలవు?" బెలూన్‌లా పొంగుతున్న దాని ఉత్సాహాన్ని సూదుల్లాంటి మాటలతో గుచ్చి ఆనందించటం సరదా జయమ్మకు. నిరుత్సాహంతో దాని ముఖం వాడిపోయేది. అంతలోనే కొంచెం ధైర్యం తెచ్చుకుని, "పోనీలెండమ్మా, మీలాంటి చదువుకున్న దయగల తల్లెవరయినా వాణ్ని కొన్నాళ్ళపాటు ఇంట్లో వుంచుకుంటే, అయ్యగార్లాంటి వాళ్లని చూసి చదువు నేర్చుకుంటాడు" అనేది ఆశతో.

"సరేలే సంబడం! మేం పెంచుకోవాలంటే మా బంధువుల్లో కో అంటే కోటిమంది వున్నారు. నీ కొడుకునే పెంచుకోవాలీ?..."

"పెంచుకోవద్దమ్మా. కొన్నాళ్ళు ఇంట్లో వుండనియ్యండి మీకు పనులు చేసిపెడ్తూ, చదువుకొంటూ వుంటాడు."

"అదిగో, ఆమాట ఇంకోమాటు అన్నావంటే వూర్కోను. తాహతుకు తగినట్లుగా పెంచుకోవాలి పిల్లల్ని. గొంతెమ్మ కోరికలు కోరితే మాత్రం తీరతాయిటే? ఎంత ఎదిగినా, ఆముదం చెట్టు మఱ్ఱి చెట్టవుతుందా?" అని కసిరేది.

అసలు లీలలోని ఈ గుణమే ముఖ్యంగా నచ్చదు జయమ్మకు ఎంతకూ 'మీరూ మేమూ సమానం కాగలం' అన్నట్లు మాట్లాడుతుందే తప్ప 'మీరు ఎక్కువ, మేం తక్కువ ... మేం ఎన్నటికీ మిమ్మల్ని చేరలేం ... ఏదో యిలా బ్రతికేస్తాం' అన్న ధోరణి లేదు. మాట తీరు, కట్టూ బొట్టూ దగ్గిర్నుండి వేషభాషలన్నీ, తోటివారిలాగా కాక, ఒక మెట్టు పైనున్నవారిని జాగ్రత్తగా గమనించి, ఉన్నతంగా మలచుకుంది. డబ్బు లేదనేతప్ప, నిజానికి గొప్పింటి పిల్లకేమీ తీసిపోనట్లుగా కనబడుతుంది.

"పొయ్యేకాలం కాకపోతే దీనికీ బుద్ధులేమిటి? చదివిస్తుందట చదువు ... ఒక్కడెంతలేదు. వాడి గురించి దీనికింత ఊహాగానాల?" అని మొగుడి ముందర తిట్టిపోసింది మనసారా.

"అబ్బ ... ఊరుకుందూ ... ఎవరి పిల్లల గురించి వారికి ఆశ వుండడంలో తప్పేమిటి" అని విసుక్కున్నాడు రామనాథం.

"అది కాదండీ ... మాటకిముందర 'అయ్యగారి'లాగా అని పోలిక తెస్తుందేమిటి? ఆ అంట్లమంగలం వెధవ మీతో సమానమవుతాడా?"

"చూడు జయా! మనది డెమొక్రసీ ... అంటే ప్రజాస్వామ్యం. ఎవడు ఎవడితోనన్నా సమానమే అవుతాడు. నువ్విలా హైరానపడిపోకూడదు."

"ఉప్పూ కారం తింటున్న మనిషి కాదు మీరు ... రోషానికీ కోపానికీ అతీతులు. మహాత్ములు చెప్పొచ్చారులెండి." లీల మీది అక్కసు భర్త మీద విసిరింది.

అత్తవారి నుండి వచ్చింతర్వాత పిల్లవాణ్ని తేవటం మానేసింది లీల. వాడు వున్నన్నాళ్ళూ అటూ ఇటూ పాకి వచ్చాడనీ, హాలులోని వస్తువులు ముట్టుకుంటున్నాడనీ నస బెట్టిన జయమ్మకు ఏం తోచనట్లుగా అయింది. పదిరోజులపాటు వాడు తిరిగిన గది బోసిగా తోచింది. 'అల్లరి వెధవనేగాని వాడు తిరుగుతూంటే బాగానే వుండేదింట్లో' అనుకుందేకాని పైకి ఏమీ అనలేదు.

రెండు నెలలు గడిచాయి.

అన్నీ అనుకున్నట్లుగా సాఫీగా సాగిపోతే అది జీవితం కాదేమో! ప్రకృతి కోపం, మనుషుల అశ్రద్ధ కలిసి ప్రతి యేడూ ఏదో ఒకవిధంగా భారీ నష్టం జరుగుతూనే వుంటుంది ఏదో ఒక మూల.

వారంరోజులపాటు భారీ వానలు పడ్డాయి వూళ్ళో. ఒరుసుకుని పారుతున్న కాలువ పొంగి గట్లు తెంచుకుని వూరిమీద పడింది ఒకరాత్రి. కాలువ గట్టు నానుకుని లోమట్టంగా వున్నవి పనిపాటలవాళ్ళ గుడిశెలు.

భోజనాలు ముగించి, అందరూ పడుకున్న వేళ అది. కాయకష్టం చేసేవారు కావటాన నిద్రరాని ఇబ్బందిలేదు ఎవరికీ. కొందరు గాఢనిద్రలోకి జారిపోయారుకూడా. సరిగా ఆ సమయాన, రాత్రి పది, పదకొండు గంటలకు, ఉరుములేని పిడుగులాగా తోసుకొచ్చింది నీటి ప్రవాహం. శివుని జటాజూటం మీదకు గంగ ఉరికినట్లు, ఊరిపైకి దుమికింది. చలిగా వుందని తలుపులు బిడాయించుకుని మరీ పడుకున్నందున చాలామందికి నీటి చప్పుడు కూడా వినబడలేదు. ఇళ్ళలో పనిపాటలు చేసుకొంటున్న ఒకరిద్దరు ఆడవారూ, నిద్రపోని ఒకరిద్దరూ నీటి వెల్లువని చూసి, అరచి కేకలుపెట్టి అందర్నీ లేపేలోపలే ఆ ప్రాంతం జలమయమైపోయింది. ప్రకృతి భయంకరంగా తయారైతే దాన్ని అడ్డే శక్తి ఎవరికుంటుంది? ఆ ఉధృతం ముందు మట్టిగుడిశెలేమి నిలుస్తాయి?

పాపం! వారికి గట్టిగా, పది కాలాలపాటు నిలిచే విధంగా ఇళ్ళు కట్టుకునే స్తోమత లేదు. పోరంబోకు స్థలాలను ఆక్రమించుకుని మట్టిగోడల మధ్య తాటాకు కప్పల క్రింద నివాసం ఏర్పరచుకున్నారు తలదాచుకునేందు కింత నీడ దొరికిందని సంతోషించారేగాని, తమ ప్రాణాలకే ముప్పని గ్రహించలేకపోయారు.

ఈత తెలిసినవారు మెరక ప్రాంతాలు చేరగలిగారు. కాని గొడ్డూ—గోదా, తల్లీ—తోడూ సర్వస్వం కోల్పోయారు. కళ్లముందే తమవారిమీద నీరు సమాధి కడుతుంటే నిస్సహాయంగా చూస్తూ, చూడలేక వారు కార్చిన కన్నీరు కూడా నీటిలోనే కలిసిపోయింది.

అరగంటలో అక్కడంతా ఏడుపులు, కేకలు, భయంతో కూడుకున్న ఆర్తనాదాలతో గగ్గోలుగా తయారైంది. ఎవరు ఎవర్ని పిలుస్తున్నారో... ఎవరు ఎవర్ని వెతుకుతున్నారో తెలియని అయోమయం... ప్రాణభీతి... పరుగులు... ఉరవడి... అయోమయం...

ఫైర్ సర్వీస్‌వాళ్లు వచ్చారు. నీటిలో చిక్కుకున్న మనుషులను, పశువులను రక్షించే ప్రయత్నాలు చురుగ్గా ఆరంభమయాయి. నిలువ నీడలేని ఆ జనాలకు మున్సిపాలిటీ స్కూళ్లలో ఆవాసం కల్పించారు తాత్కాలికంగా. రోజూ వారికి ఆహారం పాకెట్ల రూపంలో అందుతోంది. కుటుంబానికింత అని లెక్కకట్టి కొంత మొత్తం సొమ్ము మరణించగా మిగిలిన కుటుంబ సభ్యులకు అందజేశారు సర్కారువారు.



'కొత్తపేట రౌడీ'లో ఒక దృశ్యం

లీల గుండెకె కూడా కొట్టుకపోయిందని విని బాధపడింది జయమ్మ. "పాపం కష్టాలు ఎలా కలిసివస్తాయో చూడండి. మొదట దాని మొగుడికి ఉద్యోగం పోయింది. ఇపుడు ఇల్లు నీటిపాలైంది. పాపం. ఏ నూర్కాలు పంచనపడి ఉందో" అంది భర్తతో.

పది అడుగుల ఎత్తున్న నీటిమట్టం తగ్గేసరికి రెండు రోజులు పట్టింది. జరిగిన జననష్టాన్ని, పశునష్టాన్ని, ఆస్తినష్టాన్ని అంచనాలు వేస్తున్నారు సర్కారువారు. వరద బీభత్సం చూట్టానికి ఆ ప్రాంతానికి వెళ్లి వస్తున్నారు ఊళ్లోని కొందరు. రామనాథం కూడా వెళ్లాడు. ఇంటికి వచ్చిన భర్తని లీల కుటుంబం గురించి అడిగింది. కాళ్లు కడుక్కుంటూ లీల కుటుంబం వరదలో మరణించిన విషాదవార్త చెప్పాడు.

"లీల, భర్త, అత్త—ముగ్గురూ ఇంట్లోనే సజీవసమాధి చేయబడ్డారు. బురదలో ఇరుక్కుపోయిన శవాలను తవ్వి తీసి ఈరోజు పొద్దున్నే ఒకచోట చేర్చారు. మధ్యాహ్నం మూక ఉమ్మడిగా దహనం చేస్తార్ట దిక్కులేని శవాలన్నీ కలిపి. రెండు రోజులుగా నీళ్లలో నాని, మట్టిలో కూరుకుపోయి వికృతంగా తయారయ్యాయి శవాలు."

"హరిహరీ!" అనుకుంది జయమ్మ. 'ఎంతటి దారుణమైన చావు!'

"ఆశ్చర్యం ఏమంటే లీల కొడుకు మాత్రం బతికే వున్నాడు. కాలువ పొంగినరోజు రాత్రి వాడిని బుజంమీద వేసుకుని పక్కింటి కుర్రాడు ఆరుబయట తిప్పుతున్నాడట. పొంగివస్తున్న నీటిని చూసి, పిల్లవాడితోసహా పారిపోయి ఊర్లోకి, మెరక ప్రాంతంలోకి వచ్చాడు. ఈవిధంగా పసివాడు బతికి బయటపడ్డాడు."

## తల్లి - ఒక మనసున విరిసిన మల్లి

"మరి ... వాడి పాలన పోషణ...బాధ్యత?" అంది జయమ్మ.

"మహిళామండలి బాలల సంక్షేమ శాఖ వారు వరదలో దొరికిన మిగిలిన అనాథ పిల్లలతో బాటు వాడిని కూడా తీసుకెళ్ళారట. ఏదైనా అనాథ శరణాలయానికి అప్పగిస్తారేమో, వాళ్ళు మాత్రం ఎన్నాళ్ళుంచుకుంటారు?" అన్నాడు రామనాథం. వాడిని గురించి లీల కన్నకలలూ, పెంచుకున్న ఆశలూ గుర్తొచ్చాయి జయమ్మకు.

జుట్టు చెదరకుండా, నవ్వు మాయకుండా గిలకలా తిరుగుతూ పనిచేసే లీల, కొడుకును బి. ఏ. చదివించాలని ఎన్ని ఊహలు చేసింది!!

'విధి ఎంత బలవత్తరమైనది! జీవితం కథలకంటె వింతైనది అంటే ఇదే కాబోలు. ఎవరి బతుకు ఎపుడే మలుపు తిరుగుతుందో ఎవరు చెప్పగలరు? ప్చ్ ... జీవితాలింతేగదా! ... ఏది శాశ్వతం కాబట్టి...'

జయమ్మ మనసు వేదాంతంతో నిండిపోయింది. మరణించిన తర్వాత లీలను బాగా అర్థంచేసుకోగలిగింది ఆవిడ.

* * *

వరద ప్రాంతానికి తామూ వస్తానంది జయమ్మ.

"అక్కడేముంది చూసేందుకు, జయా! రాబందులు ముసురుతున్న శవాలూ, బురదలో ఇరుక్కుపోయిన మొండిగోడలూ తప్ప ... నీ గుండె బేజారవుతుంది."

"మండలికి కూడా ఓమారు వెళ్ళాలనుందండీ."

"వెళ్లి?"

"రాజు ... అదే ... లీల కొడుకు, వాణ్ణి చూడాలి"

"........."

"వాణ్ణి కంటికి రెప్పలాగా కాపాడుకునేది పాపం. ఏ లోకాన్నుందో! వాడు యిలా అనాథ శరణాలయంలో వున్నాడంటే దాని ఆత్మ ఎంత ఘోషిస్తోందో?"

"మనం వెళ్ళి చూసినంత మాత్రాన ఏమవుతుంది, చెప్పు?" నచ్చచెబుతున్నట్లుగా అన్నాడు.

"చూట్టం మాత్రం కాదు, వీలైతే ఇంటికి తెచ్చేసుకుందాం." తెల్లబోయినట్లు, నిశితంగా భార్యవంక చూశాడు.

"మీకు ఆశ్చర్యంగానే వుంటుంది. నాకు తెలుసు. మనవాళ్ళలోనే పెంపుడు వద్దన్నదాన్ని..." తలొంచుకుంది జయమ్మ. "అది బ్రతికుంటే తినో తినకో వాణ్ణి బాగానే చదివించివుండేది. మనకి దేవుడింత ఇచ్చాడు. ఏం పోయింది? ..."

అసలుకారణం అంతమాత్రమేకాదు. ఆవిడ మనసులోని ఆరాటం మాటల్లో పెట్టలేకుండా వుంది. విధి కారణాన ఆశయాలు నశించిపోకూడదు. విలువలు గుర్తింపులేకుండా పోకూడదు. చైతన్యం అనేది ఎక్కడున్నా, ఏ కారణాన కూడా స్తంభించిపోకూడదు. లీల కన్నకలలు ఫలించాలి. ఇవన్నీ పైకి చెప్పలేకపోతోంది.

మాటల్లో వ్యక్తపరచినదానికంటే, మౌనంగా దాగివున్న భావాలు గ్రహించటం చాలా తేలిక ఒక్కోసారి. రామనాథం భార్య మనసును సరిగానే అర్థంచేసుకున్నాడు.

"ఉప్పూ కారం తింటున్న మనిషివేనా నువ్వు? రోషం లేదూ? వాడు మనతో సమానమా? నీ యింటికెలా తెస్తావు వాణ్ణి?" ఆటలు పట్టించటానికన్నట్లుగా అన్నాడు.

"నన్నేం అలా దెప్పనక్కర్లేదులెండి. ఉప్పూ కారం తింటున్నాను గనకే జాలీ ప్రేమా కూడా ఉన్నై నాలో రోషంతోబాటు. లేవండి వెళదాం మరి" అంది హుషారుగా భర్త అంగీకరించాడని గ్రహించిన జయమ్మ.